

# పోగొట్టుకున్న రైలు టిక్కెట్టు

## కేశవగోపాల్

తమ్ముడి ఉత్తరం తీసి మళ్ళీ చదువుకున్నాను.

అన్నయ్యకు నమస్కారములతో — తమ్ముడు వేణుగోపాలం వ్రాయునది. క్షేమం. వదినకు జబ్బుగా వుందని తెలిసినా రాలేకపోయాను. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం ఎలా వుంది? పిల్లలు క్షేమమే నా? ముఖ్యంగా వ్రాయడమేమంటే పరీక్ష ఫీజు 24 గో తారీఖుకల్లా కట్టాలని. ఉత్తరం పది రోజుల క్రిందటే వ్రాశాను. ఇంత వరకు మీ వద్దనుండి జవాబు రాలేదు. ఈ రోజు 22 వ తారీఖు — యిక ఒక్క రోజు మాత్రమే గడువుంది. పరీక్ష ఫీజు సమయానికి కట్టలేకపోతే యిన్నేళ్ళ చదువూ వ్యర్థమైపోతుంది. మీరు తప్పకుండా 24 వ తారీఖు 12 గంటలకల్లా నాకు డబ్బు చేరేలా పంపిస్తారని నమ్ముతున్నాను. అలా పంపకపోయే పక్షంలో... ఫలితాలు మీకు తెలియనివిగావు. వదిన గారికి నా వందనములు. పిల్లలకు ఆశీర్వాదాలు.

ఇట్లు

తమ్ముడు

వేణుగోపాలం.

డబ్బు... డబ్బు... ఎక్కడ్నుంచి తేవాలి డబ్బు...??

గోరుచుట్టుపై రోకటిపోటు. మా ఆవిడ [illegible]ంతానికి హఠాత్తుగా "పెరాలటిక్ అటాక్" వచ్చింది. ఈ నెల్లోనే మూడొందలు ఖర్చయింది. ఆస్పత్రిలో చేర్పించాను. ఆస్పత్రిలో రోజూ పది రూపాయలు ఖర్చవుతుంది. నెల రోజులకు మందులకు, డాక్టర్లకు, ఫీజులకు, దానికీ, దానికీ మూడొందలైంది.

పెద్దమ్మాయి కాన్పుకు సిద్ధంగా వుందట. వియ్యంకుడు ఉత్తరం వ్రాశాడు. ఆవిడ్ని పురుడుకు తీసుకురావాలి! ఎంత డబ్బని తేవాలి!... అప్పు!... ఎవడిస్తాడు అప్పు!!

గుట్టుగా సంసారం చేసుకపోతానని, ఆఫీసులో కాస్తో కూస్తో మంచి పేరుండటం వల్లనూ మిత్రులూ, తెలిసినవాళ్ళూ చాలా అప్పులిచ్చారు. ఆ వేవీ తీర్చేస్థితిలో లేను. రోజు రోజుకూ పరిస్థితి దిగజారిపోతూ వుంది. దారీ తెన్నూ కనిపించడం లేదు.

తమ్ముడి ఉత్తరం కళ్ళలో మెదిలింది. ఇవాళ తారీఖు 23. సాయంత్రమైందప్పుడే. వాడు ఫీజు చెల్లించాల్సింది రేపే. వంద రూపాయలదాకా వుంటుంది. ఐదేళ్ళ నానా గడ్డీ కరిచి వాణ్ణి చదివించాను. మామూలు చదువు కాదు. ఎం. బి. బి. ఎస్. వాడి తెలివి, చదువుపట్ల శ్రద్ధా, పట్టుదల చూసే ఎన్ని ఇబ్బందులొచ్చినా ఎదుర్కొన్నాన్నేను. తల మునిగేంత వరకు అప్పులు చేశాను. ఇది వాడికి ఫైనలియరు. చదువంతా ఒకెత్తు. ఈ సంవత్సరం ఒకెత్తు. తప్పకుండా ప్యాసవుతాడువాడు. డిస్టింక్షనులో ప్యాసవుతాడు. అంత శ్రద్ధ వాడిది. అంత తెలివి వాడిది. అమ్మకు వాణ్ణి కంటికి రెప్పలా కాపాడుకుంటానని యిచ్చిన మాట గుర్తొచ్చింది. వాడు పరీక్ష ప్యాసవుతే నా కష్టాలు గట్టెక్కుతాయి. వాడు ప్యాసవాలంటే ఫీజు కట్టాలి... ఫీజు కట్టాలంటే డబ్బేది?...

ఎవర్నడగాలి?... అడిగీ అడిగీ విసుగెత్తిపోయింది. చివరికి నా ముఖం చూస్తేనే అప్పు కొచ్చాననుకొనే స్థితికొచ్చింది. ఏదో విషయం మాట్లాడాలని ఏ మిత్రుడ్ని పక్కకి పిలిచినా, విషయం పసికట్టేసినట్లు "సారీ భాయ్! నా దగ్గర ప్రస్తుతం డబ్బేమిలేదు." అంటారు. ఈ స్థితిలో అసలు బ్రతకడమే నీచంగా వుంది. ఇన్నిరోజులు రక్తం ధారపోసి ఉద్యోగం చేస్తే నేటికి మిగిలిందేమిటి?... గొంతువరకు అప్పులు... రోగాలు బ్రతుకంటే వరమంటారు. మరి నాకు యింత నీచంగా కన్పిస్తూవుందేమిటి? బ్రతుకంటే ఆశ నిరాశల సంయమనమేనంటే బాగుండేది.

డబ్బుకోసం చెడతిరిగాను. దమ్మిడీ పుట్టలేదు. నా కొలీగ్ రామారావు బాగా డబ్బున్నవాడు. వాడికి బ్యాంక్ అకౌంట్ కూడా వుంది. అకౌంట్‌లో డబ్బు ఎప్పుడూ నిలవుంటుంది. డ్రా చేయడమంటే ఏమిటో ఎరుగడు. ఆఖరికి పడ్డీకాళపడి పెళ్ళాం నగలన్నీకూడా బ్యాంకులో పెట్టేశాడు. పెళ్ళాం లబోదిబోమన్నా పట్టించుకోలేదు. వాడు వడ్డీ వ్యాపారంకూడా చేస్తాడు. ఆఫీసులో డబ్బుతో అవసరమున్న వాళ్ళకి వాడు దేవుడు. దేవుడంటే మరో రూపంలో వుండడు. సాక్షాత్తు రామారావే. వాడ్ని డబ్బడిగితే తల భూమ్మీద కు వేలాడేసి "ఎక్కడిది భాయ్" అనుకున్న వాళ్ళలో ఒక్కడూ తిరిగే యిచ్చిన పాపాన పోలేదు. ... సారీ" అన్నాడు తెచ్చిపెట్టుకున్న యింగ్లీషు వినయంతో. వాడి తప్పు మాత్రం ఏముంది? ఎన్ని సార్లని అప్పిస్తాడు. అప్పుతీసుకొని తీసుకొని ఆఫీసులో గౌరవమే పోయింది. పోనీ కాబూలీ వాలా" దగ్గరకెడితే, పది రూపాయలు వడ్డీ ముందుగానే పట్టుకొని తొంభై చేతులో పెడతాడు. ప్రతీనెలా పదిరూపాయలు వడ్డీ కట్టాలి. పది నెల్లు జరిగితే అసలంత వడ్డీ అవుతుంది. అయినా పరవాలేదు. అసలు సమయానికి వాడి లాభంలేదు. వాడి కిప్పటికే రెండొందలు బాకీ. వాడిస్తాడనే నమ్మకంలేదు. అయినా ఆశ చెడ్డది కాళ్ళీడ్చుకుంటూ వెళ్ళి వాడి యింటితలుపు తట్టాను. డబ్బు కావాలని ప్రాధేయపడ్డాను.

"ఏం మనిసివయ్యా, పాత బాకీ పైసలు చేస్తా లేదు... ఫిర్ పైసల్ కావాలీ... వారేవా... మేరేపాస్ పైసాగీసా నైహాఁ!" అంటూ ముఖం

ఏదే తలుపులు మూశాడు. ఛీ...పాడు బ్రతుకు.

జీవితంతో నిరంతరం ఘర్షణ పడుతూ ఈ బతుకు బతక్క పోతేనేం?

ప్రపంచం యింత స్వార్థపూరితంగా మారిపోయిందేమి? ప్రపంచాన్ని నడిపించేది డబ్బేనా? డబ్బిస్తే ఏపనీ జరగదూ: చిన్నప్పుడు డబ్బులేకపోయినా బతకొచ్చు ఓ మిత్రుడితో వాదించాను. వాడిప్పుడు కలిపిస్తే 'అపాలజీ' (క్షమాపణ) చెప్పుకోవాలని వుంది. అదిసరే... మరిప్పుడెట్లా అప్పుడేగంట ఆరు.

డబ్బు కట్టకపోతే వాడి భవిష్యత్తు నాశనం దాంతో పాటే నాదీ... వేలరూపాయలు అప్పు చేసి చదివించాను. చివరికి పరీక్ష ఫీజు కట్టలేక వాడి జీవితం నాశనం చేస్తావా. నా జీవితం నాశనం చేసుకుంటానా? వాడు రేపు డాక్టరయితే నా యింటికి పదిమంది రావాలి. "డాక్టరుబాబున్నాడా?" అని.

నా తమ్ముడు డాక్టరంటేఎంత గౌరవం. ఎంత ప్రతిష్ఠ డబ్బు...! ఎంతడబ్బు! ఎంతైనా సంపాదించొచ్చు. కనకయ్యగారి రెండో అబ్బాయి డాక్టరై రెండేళ్ళే అయింది. ఓ మాంచి యిల్లు కట్టించాడు. ఓ ఫియెట్ కారుకూడా కొన్నాడు. అబ్బో ఎంత దర్జాగా బ్రతుకుతున్నాడు... మావాడు డాక్టరయితే నేనూ దర్జాగా బ్రతుకుతాను. పిల్లలకి చదువులు పెళ్ళిళ్ళు ... అన్నీ తీర్తాయి... నలుగురిలో కావలసినంత మర్యాద ...అయితే యిప్పుడే "ఫీజు" సమస్య ఎలా తీరుతుంది. డబ్బు ఎలా కట్టాలి. అబ్బా...టైం ఆరున్నర. ట్రెయిన్ ఏడున్నరకే. దానికిపోతే గాని అందుకోలేను. పోనీ T. M. O. చేస్తే అసలు డబ్బు పుట్టాలిగా? ఓహో గుర్తొచ్చింది. డబ్బుపుట్టినా వీల్లేదు T. M. O. చేయడానికి ఇరవైనాలుగో తారీఖు పోస్టల్ స్ట్రయిక్. అవును మరి. కడుపునిండకపోతే ఎవడు మాత్రం ఏం జేస్తాడు. పొట్టకోసం మానాన్ని పణంగా పెడుతూంటే స్ట్రయిక్ చేయడం తప్పా. తప్పకుండా చేస్తారు. సరే మరి నాసమస్యేమిటి

ఆలోచనలు గిర్రున తిరుగుతున్నై. సమస్య పరిష్కారం కావటంలేదు. ఏమైనా సరే రాత్రి మెయిల్ కి వెళ్ళి తీరాలి. రేపు ఫీజు కట్టితీరాలి. పొద్దుట్నుంచి డబ్బుకోసం తిరుగుతూ అన్నం తినలేదు! కాంతానికి ఎలాగుందో? ఇంట్లో పిల్లలు వండుకుతిన్నారో లేదో? నాకు మాత్రం ఆకలవుతూ వుంది. కాఫీ తాగితే సరి ఆకలి చచ్చి పూరుకుంటుంది. ఏదైనా ఐడియా కూడా తట్టొచ్చు! చిల్లర చూచుకున్నాను. వుంది పరవా లేదు.

హోటల్లో దూరాను.

మనుషులు తేనెటీగల్లా ముసురుకుంటున్నారు. ఒక్క కుర్చీ కూడా ఖాళీలేదు. యింతమంది తింటున్నారా? యింత షోగ్గా ముస్తాబై వచ్చి మరీ తింటున్నారా? వీళ్ళకింత డబ్బెక్కడిది?

కుర్చీలోంచి ఎవడో లేచిపోయాడు. నేను వెంటనే ఆ కుర్చీలో కూర్చున్నాను. వాడు చేతులు తుడుచుకుంటూవచ్చి "ప్లీజ్! నేనిక్కడ కూచున్నాను" అన్నాడు.

సిగ్గుతో చప్పున లేచాను. వాడు కాఫీ తాగి పోయినంత వరకు నిలుచుండి, పోగానే కూలబడ్డాను గర్వంగా నిటూరుస్తూ. చెవిలో పెన్సిల్ తో వచ్చిన సర్వరుకి "కాఫీ" ఆర్డరిచ్చాను. కాఫీ తెచ్చాడు. తాగి బిల్లు చెల్లించడానికి పోతూంటే "క్యాషియరు" మరో యిద్దరు సర్వర్లూ ఒక కుర్రాణ్ణి పట్టుకొని చావచితక బాదుతున్నారు. వాడు కడుపునిండా టిఫిన్ మెక్కి కాఫీ తాగి డబ్బు లివ్వకుండా వుడాయించేస్తున్నాట! పాపం! వాడికాకలేస్తే ఏం చేస్తాడు? ఎవర్నయినా పనడిగి వుంటాడు. పని దొరికే కాలమా యిది. దిక్కుమాలిన కాలం! ఆకలి తీర్చుకోవాలి! అది ప్రకృతి ధర్మం. ఆకలి అంతపని చేస్తుంది. అవశ్యం వాడు ఏదో ఒకటి తినాలి, తినడమూ— తినకపోవడమూ వాడి వశంలో లేదు. యింతా చేస్తే వాడు తిన్నది 95 పైసలకు. నేను అడ్డుపడ్డాను. జేబులో చిల్లర చూస్తే రూపాయి చిలుకే వుంది. వాడి బిల్లుకూడా నేనే చెల్లించి బయటకొచ్చాను. వాడు పిల్లిలా నా వెనకేవచ్చి "నమస్కారం బాబూ! మీరు లేకపోతే నా ప్రాణాలు తీసేవారు. ఆకలేసిందండి. పనడిగితే దొరకలేదు. అడుక్కుంటే పెట్టలేదు... అందుకని చేశాడు. తప్పయింది యింకెప్పుడూ చేయను అన్నాడు

వాడి ప్రాణం విలువ 95 పైసలు. 95 పైసలు లేకపోతే వాడి ప్రాణం పోయేదివ్వాళ. దీనంగా వాడు నమస్కారం పెట్టి వెళ్ళిపోతుంటే పిలిచి, మిగిలిన పావలా వాడిచేతులో పెట్టాను.

బరువుగా అడుగులేశాను. మస్తిష్కం వేడెక్కింది. కాఫీ తాగినా ప్రయోజనం లేకపోయింది.

వాడెందుకు దొంగతనం చేశాడు. సమాజం వాడిచేత చేయించింది! వాడి అవసరం తీర్చుకోవాలంటే ఆదే మార్గం. అడిగితే ఎవరూ పెట్టలేదట. మరి అడిగితే ఎవరేనా పెడతారా? అవసరం తీర్చుకోవాలి. ఏలాగైనా తీర్చుకోవాలి. ఏదో నామనసులో మెరిసింది. "బెగ్... బారో...స్టీల్" అని ఏ మహానుభావుడు చెప్పాడో గాని సరిగానే చెప్పాడు. యివ్వకపోతే లాక్కోవాలి దొంగతనం చేయాలి...అంతే

రిక్షాగంటలు గణగణ లాడాయి!

"ఏంటయ్యో! సుక్కేసుకున్నావా? బెల్లు గొట్టినా యినిపిస్తలే." అనరిచాడు రిక్షావాడు.

దొంగతనమైనా చేయాలి, దొంగతనమైనా... ఇదేధ్యాస. నేరుగా ఆఫీసుకు దారితీశాను ఆఫీసులో డబ్బుంది. ఆడబ్బు చేజిక్కించుకోవాలి... అదీసంగతి అంతే!

• • •

టైం చూసుకున్నాను. ఏడుంబావు. మెయిల్ ఏడూ ఇరవైపై బయలుకి. పది నిమిషాలే వుంది మెయిలుకి టైం దూరంగా టాక్సీ, ఖాళీగా పోతూ వుంది!! "టాక్సీ" అనరిచాను. నా కీచుగొంతు లాగే టాక్సీ బ్రేకుకూడా కీచుమంది. టాక్సీ రివర్స్ చేసుకొని వచ్చాడు డ్రైవరు. మెయిల్ కెళ్ళాలి. పది నిమిషాలేవుంది. పోనీ...తొందరగా పోనీ" అన్నాను డోరు వేస్తూ...

నుదుటిమీద చెమట బిందువుల్ని తుడుచుకున్నాను!

స్టేషనొచ్చింది, దీపాలవెలుగులో దివ్యంగా వుంది స్టేషన్... చాలా కలకలంగా గలగలగా అరే టైలొచ్చిందే. జేబులోంచి తీసి ఐదురూపాయల నోటిచ్చాను! డ్రైవరుకు చిల్లర తీసుకోడానికి వ్యవధిలేదు. ట్రెయిన్ కదలడానికి సూచనగా ఆఖరు బెల్లు మోగింది. గబగబ టికెట్టుతీసుకున్నాను. జన సందోహంలోంచి దూసుకుంటూ వెళ్ళాను. గార్డు పచ్చదీపం చూపిస్తూ విజిల్ వేశాడు.

రైలు గుండెలదిరేలా, ఆకలిగొన్న సింహంలా, సింహనాదం చేస్తూ బయలేరబోతూ వుంది... పరుగెత్తుకెళ్ళి కడ్డీ కరుచుకున్నాను. డోరు తెరుచుకొని లోనికెళ్ళి మూడో క్లాసులో ఓ మూల కూలబడ్డాను.

"అమ్మయ్యా! డబ్బు దొరికింది... బండీ దొరికింది..." అని గట్టిగా శ్వాస పీల్చుకున్నాను. రాత్రంతా ప్రయాణం చేశాను. ప్రయాణం పొడుగునా మా ఆవిడకు చెప్పకుండా వచ్చేసినందుకు ప్రాణం పీకుతూనే వుంది. దానికి ఎలా వుందో? పిల్లలు వుడికేసుకు తిన్నారో లేదో?... నా దొంగతనం ఆఫీసులో తెలిసిపోతే, నేను జైలుకు పోతాను... యింక పోయినా పరవా లేదు. తమ్ముడు డాక్టరౌతాడు! డబ్బు సంపాదిస్తాడు... డబ్బు సంపాదించలేని గుమస్తాగా వెధవ బ్రతుకు బ్రతికేకన్నా జైలే నయం! మరి దొంగతనం చేశానంటే పూరికే చేశానా! అడిగితే ఎవడైనా కాపీ యిచ్చాడా! రెండు పచ్చనోట్లు ఎలా సంపాదించగలిగి వుందును...?

ఆర్యన్ వారి

కళ్యాణి : గర్భదాతముతో బాధపడు స్త్రీలకు ఆరోగ్యము, సంతాన సౌభాగ్య ప్రాప్తి నొసగు టానిక్.

అమృతవల్లి సారస : రక్తమును శుద్ధిచేయు టానిక్. స్త్రీ పురుషులు అన్ని ఋతువులలోను సేవించవచ్చును.

తయారుచేయువారు :

ఆర్యన్ డ్రగ్గు కంపెనీ—తణుకు.

అన్ని మందులషాపులలో దొరకును. A.P.

# పోగొట్టుకున్న రైలుటిక్కెట్టు

తెల్లారగానే స్టేషనొచ్చింది. రైలు దిగబోతూం డగా "వచ్చావా అన్నయ్యా! నువ్వు రావొచ్చని స్టేషను కొచ్చాను. డబ్బు తెచ్చావా" అనడిగాడు అదుర్దాతో. "తెచ్చాను పద" అన్నాను. యాంత్రికంగా గేటు దగ్గరకు నడిచాం. "టికెట్ ప్లీజ్" అన్నాడు టి.సి. టికెట్ కోసం జేబులో చెయ్యి పెట్టాను. అరె టిక్కెట్టేదీ? జేబు సగం కోతబడి వికృతంగా చూస్తూవుంది నావైపు.

"పర్సు... టిక్కెట్... రెండొందలూ పోయింది... ఎవరో జేబుదొంగ కొట్టేశాడు... నా గొంతుక ఒక పట్టాన పెగల్లేదు.

"ఇదీ ఒకరకం వేషమే" అన్నాడు టి.సి. విచిత్రంగా నవ్వుతూ. భూమి కంపించింది. సగంగా చీలింది, అందులోకి పడిపోతున్నాను... నెత్తిన పిడుగులు వర్షించాయి..

ఇంతలో స్టేషన్లో ఓమూల పెద్ద కలకలం బయలుదేరింది. ఇద్దరు ముగ్గురు రైల్వే పోలీసులు ఎవరో కుర్రాడ్ని కొడుతూ అక్కడికి లాక్కొచ్చారు. వయస్సు దాదాపు ఇరవై వుంటాయి. ప్రపంచంలోని దిగులంతా అతనిముఖంలోనే వున్నట్లుంది. కానీ పోలీసులు కొట్టే దెబ్బలకు వులకటం లేదు. పలకటంలేదు. ఇష్టమొచ్చినట్లు బాదారు పోలీసులు. దొంగతనం ఎందుకు చేశావో చెప్పమన్నారు. బహుశ ఆఅబ్బాయే అయివుండొచ్చు నాపర్సు కొట్టేసింది!

ఆ అబ్బాయి నోరువిప్పాడు.

"అవును దొంగతనం చేసాను! నేనే చేసాను అడిగితే ఎవడిచ్చాడు. నెటంత మనిషిమీద నమ్మకం ఎవడెట్టాడు. మా యమ్మ కోసం చేసాను. నన్ను కన్నతల్లికోసం చేసాను. మాఅమ్మ సావు బతుకుల్లోవుంది. ఆపరేసను చేత్తే బతుకుతుందంట. అపరేసనుకు రెండొందలు కావాల అందం ...గవురుమెంటు డాకరుకు "రెండొందలు తీసుకురా మీ అమ్మను బతికిస్తాను" అన్నాడు డాక్టరుబాబు. మాఅమ్మ నన్ను తొమ్మిదినెల్లు మోసింది. అందరి అమ్మల్లాగే. కనింది. పెంచింది. కళ్ళలో పాణాలు పెట్టుకుని కాపాడింది. తన పాణానికి పాణంగా సూసుకుంది. ఆమె ప్రాణం విలువ రెండునూర్లు. నేనుమాయమ్మను బతికించుకోవాలి, లేకపోతే నేను బతికి లాభం యేంటి. మాయమ్మ ఋణం ఎట్టా తీరుసుకోవాలి!

డాక్టరుబాబు కాళ్ళమీద పడి బతిమాలాను."

"బాబూ మీరు సానామంచోరు. మీరు ఎందరికో పాణాలు పోసి పుణ్యం గట్టుకున్నారు. నన్ను దిక్కు లేని పచ్చిని చేయకండి. నాకీ పెపంచంలో మిగిలిందొక్కటే. మాఅమ్మ - మాఅమ్మ పోతే నేను బతకలేను బాబుగోరూ - బతికినంత కాలం నేను మీ యింట్లో నౌకరీచేసి నారుణం తీరుసుకుంటాను. నాదగ్గర డబ్బుల్లేవు ... మా అమ్మని బతికించలేకపోతే నన్నూ సంపేయండి ..."

అని కాళ్ళుపట్టుకొని బతిమలాడాను! కానాయన డాక్టరుకాదు. ప్రాణాలు రక్షించే భగవంతుడూ కాదు. పత్థరాయి. డబ్బులిస్తేగాని రాతిగుండె కరగదు... మాయమ్మ ప్రాణం విలువ రెండు నూర్లయినప్పుడు... దొంగలించయినా మాఅమ్మ ప్రాణాలు కాపాడా లనుకున్నాను. అందుకనే దొంగతనం చేసాను... ఎవరు ఎవరి తల్లితండ్రి ఋణం తీరుసుకోవడమైనా తప్పంటే కొట్టండి. యింకా కొట్టండి. కాని ఒకిసయిం... నన్ను కొట్టినందుకు జైల్లో యేసినందుకు పాపంలో పడతారు. మాయమ్మ వుసురుమీకు తప్పకుండా తగులుది... మీకు కాతనయితే డాక్టరుబాబును కొట్టండి జీతం తీసుకొంటూ లంచమడిగి నన్ను దొంగతనం చేసేలా చేసినందుకు ఆయన్ని జైల్లో యెట్టండి సూత్తాం ...హ...హ...హ మీకు కాతగాదు, అందుకనే నేను దొంగతనం చేశాను...హ...హ...హ... అంటూ పిచ్చిగా నవ్వాడు,

తల్లి ప్రాణాలు రక్షించడం కోసం దొంగతనం చేశాడా? డాకరి రెండొందలిస్తే గాని ఆపరేషన్ చేయనన్నాడా? ఘాతకుడు యింత డబ్బుపెట్టి. యిన్ని నీచకృత్యాలకు పాల్పడి నా తమ్ముడిని డాక్టరు చేస్తే... నిజమే... నా అప్పులు తీరుస్తాడు, పిల్లల పెళ్ళిళ్ళకు సాయం చేస్తాడు నాకు ఒక యిల్లు కటిస్తాడు. ఒక కారు కొంటాడు. ఆ కార్లో నేనూ నాభార్యా పిల్లలూ కులుకుతూ తిరుగుతాం. కాని యింత పాడు డబ్బు. సంపాదించాలంటే నీతిగా సంపాదించగలడా? — నా తమ్ముడుకూడా ఎందరి మనుష్యులరక్తాన్నో పిండుకుని త్రాగాలి. ఎందరి ఉసురో కట్టుకోవాలి, ఎన్ని కొంపలో కూల్చాలి, వద్దు, నా తమ్ముడికీ డాక్టరుగిరి వద్దు... డబ్బు కోసం మనుషుల ప్రాణాల్తో చెలగాటాలాడే ఈ పదవీ... డబ్బూ వద్దు... ఇంతకన్నా నా తమ్ముడు ఏ గుమాస్తాగానో, కూలివాడో బతికే నయం!!

పోలీసులు ఆ అబ్బాయి చేతులకు బేడీలు తగిలించి లాక్కెళ్ళారు. ఇంత జరుగుతూ వుంటే ఆ రెండొందలు పోగొట్టుకున్న ఆసామిని నేనే నని, ఆ డబ్బు నాదేనని చెప్పబుద్ధి కాలేదు. ఇంతా చేస్తే ఆ రెండొందలూ నేను దొంగిలించిందేగదా... నేను తమ్ముడి చదువుకోసం దొంగిలిస్తే, అతను వాళ్ళమ్మ ప్రాణాలు కాపాడ్డం కోసం దొంగిలించాడు. కాని పాపం... ఫలితం దక్కించుకోలేకపోయాడు. ఆ డబ్బు నాకు గాక పోయినా, అతనికైనా ఉపయోగపడనందుకు నాకు విపరీతమైన బాధ వేసింది...అతడు మాట్లాడిన మాటలు ఒక్కొక్కటీ ఒక్కొక్క శూలంలా గుచ్చుకున్నాయి నా హృదయంలో.

స్టేషన్లో మనుష్యులందరూ వెళ్ళిపోయారు. నేనూ, మా తమ్ముడూ, టిక్కెట్ కలెక్టరు మాత్రం మిగిలిపోయాం— రైలు భయంకరంగా ఈల వేస్తూ, భూమి దద్దరిల్లేలా శబ్దం చేస్తూ కదిలింది

మళ్ళీ "టిక్కెట్ విషయం ఏం చేశారండీ?" తన విధ్యుక్తధర్మాన్ని జ్ఞాపకం తెచ్చుకొని హెచ్చరించాడు టి.సి.

"నేను టికెట్టు లేకుండా ప్రయాణం చేశాను. ...నా దగ్గర డబ్బులుకూడా లేవు...మీ ధర్మాన్ని మీరు నిర్వర్తించవచ్చు," అన్నాను ఏదో నిశ్చయించుకుని. మా తమ్ముడివైపు తిరిగి "తమ్ముడూ నేనింక అసహాయుణ్ణి... నీ దారి నీది నా దారి నాదీ ఇక... నీ బ్రతుకు ఎలాగో నువ్వు బ్రతుకు... నేను తిరిగి రాకపోతే నీ వదిన్ని, పిల్లల్ని కనిపెట్టి వుండు... అంటూ చిన్నగా వాడి భుజం తట్టాను. వాడి కళ్ళలో నీళ్లు గిర్రున తిరిగాయి.

"స్టేషనుకు పదండి అన్నాడు టి. సి."

నేను గాఢంగా నిట్టూర్పు విడుస్తూ. ఆయన వెంట కదిలాను.

"నానిట్టూర్పు దూరంగా వెళ్ళేరైలుకూతలో కలిసిపోయింది!"

నా జీవితమే ఒక రైలు ప్రయాణం! ప్రయాణం ఎక్కడికో తెలీదు. ఏ స్టేషనులో దిగాలో తెలీదు. ఈ గమ్యంలేని రైలు ప్రయాణంలో నా టిక్కెట్టు ఎక్కడో పోగొట్టుకున్నాను

★

నెలకు రూ 600/- సంపాదించండి



ప్రపంచ ప్రఖ్యాతి చెందిన రోమర్ వాచీలకు తీరిక వేళలలో ఆర్డర్లు బుక్ చేసి రూ 600/- నెలకు సంపాదించండి. ఉచిత షరతులకు మరియు శాంపిల్ వాచీకి వ్రాయండి.

TAJ Co, (WAJ-88)
P. Box 1383, DELHI-6

3 నెలలవరకు ఉచిత బహుమతి

స్త్రీల సౌందర్యము కాశ్మీర్ ఆర్ట్ చీరెలు, ఆకర్షణీయమైన సరికొత్త డిజైన్లు, రంగులలో పీజనులకు తాజాగా వచ్చినవి, పెద్ద సైజు, మావద్ద మాత్రమేఉన్నవి. వెల డీలక్స్ 1చీరె రూ 11/-లు 2చీరెలు రూ 20/-లు 3 చీరెలు రూ 28/-లు 4చీరెలు రూ 36/- లు. రెండు లేక ఎక్కువ చీరెలు ఆర్డరిచ్చిన వారికి ఒక బ్లౌజు ముక్క ఉచితము. ఆర్డర్లు పోస్టు పార్సెలుద్వారా పంపబడును.



ARVIND AGENCIES. (A JW-22)
P. O. Box No. 1408, Delhi-6